## క్లుప్తంగా

### బీజేపీ సభ్యత్వ నమోదు చేయించాలి



భిక్కనూరు : ప్రజలకు బీజేపీ సిద్ధాంతాలను ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను చేపట్టాలని కామారెడ్డి మున్సిపల్ ఫ్లోర్ లీడర్, సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల ఇంచార్జీ మోటూరి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలోని మార్కెండేయా ఆలయంలో మండల స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమవేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, ప్రధాన కార్యదర్శులు గణేష్‌రెడ్డి, తిర్మలేష్ తదితరులున్నారు.

### మాచారెడ్డిలో..



మాచారెడ్డి : సభ్యత్వ నమోదులో కార్యకర్తలు దూకుడు పెంచాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మాచారెడ్డి,పాల్వంచ మండల కేంద్రాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేస్తూ సభ్యత్వ నమోదును వేగిరం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాచారెడ్డి,పాల్వంచ మండలాల అధ్యక్షులు సురేష్,అనిల్,ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింలు తదితరులున్నారు.

### పంచాయతీ కార్మికులకు జీవిత బీమా



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రానికి చెందిన రౌత్‌వార్ అద్విక్ పుట్టినరోజు సందర్భంగా వినూత్నంగా అతడి తండ్రి బీజేపీ యువనాయకుడు కృష్ణ పటేల్ ఆదివారం స్థానిక పంచాయతీ కార్మికులకు జీవిత బీమా పత్రాలను అందించారు. తన కుమారుడు పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో పనిచేసే 25 మంది మల్టీపర్పస్ కార్మికుల పేరిట పోస్ట్ ఆఫీస్‌లో జీవిత భీమా పథకం చేపించారు. బీజేపీ నాయకులు తుకారం, సంతోష్, సుభాష్, శ్రీపద్, కిరణ్, గ్రామ పంచాయతీ కార్మికులు ఉన్నారు.

### సొసైటీ ఏర్పాటుపై సంబురాలు



భిక్కనూరు : మండలంలోని కాచాపూర్‌లో సింగిల్‌విండో (సొసైటీ) ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు ఆదివారం సంబురాలు జరుపుకొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీలు జాంగారి గాలిరెడ్డి, తొగరి సుధర్శన్, డీసీసీబీ డైరెక్టర్ లింగాల కిష్టగౌడ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ వల్లే సొసైటీ ఏర్పాటు సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైండ్ల భూపతి, నాయకులు రాపర్తి రాజగౌడ్, యాదయ్య, నర్సింలు, సాయిరెడ్డి, రమేష్ తదితరలు పాల్గొన్నారు.

### పాత ఫోన్లతో సైబర్ నేరాలు



కామారెడ్డి క్రైం : పాతబడిన, మరమ్మతులకు వచ్చిన ఫోన్లను విక్రయించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. పట్టణ పోలీసులు ఆదివారం బస్టాండ్, సుభాష్‌రోడ్, గంజ్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త కొత్తదారుల్లో నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పాత ఫోన్‌లలో ఉండే ఐఎమ్‌ఈఐ నెంబర్ సాయంతో వివరాలు తెలుసుకుని సైబర్ నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు.

# ఎటుచూసినా సమస్యల కుప్పలే..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అటకెక్కింది. మురికికాలువల శుభ్రం, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాలు జరగకపోవడంతో ఆయా ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మాచారెడ్డి మండల కేంద్రంలో ఇందిరమ్మ పైలాన్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

### విగ్రహం చుట్టూ పిచ్చిమొక్కలు

మాచారెడ్డి : మండల కేంద్రంలో మహిళ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సొంత గ్రామంలో ఇలా ఇందిరాగాంధీ విగ్రహం పరిస్థితి ఇలా ఉండటమేమిటని పలువురు ఆశ్చర్యపోతున్నారు. విగ్రహం చుట్టూ పరిసరాలన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో ఇబ్బందిగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

### పిచ్చిమొక్కలతో ఇబ్బందులు



కుప్రియాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని కుప్రియాల్ గ్రామంలోని బీసీ కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. పాత ఇళ్లు కూలిపోయే స్థితిలో ఉన్నా జీపీ వర్గాలు పట్టించుకోవట్లేదని వారంటున్నారు. ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములు, తేళ్లు తమ ఇళ్లలోకి వస్తున్నాయన్నారు.

### సంపుతో విద్యార్థులకు ఇబ్బంది



బాన్సువాడ రూరల్ : మండలంలోని కొత్తాబాది గ్రామంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం ఆవరణలో పాఠశాల భవన నిర్మాణ సమయంలో నిర్మించిన సంపు ప్రస్తుతం పూర్తిగా నిండిపోయింది. దీంతో సంపు నుంచి మురుగునీరు బయటకు పారుతుండటంతో తరగతి గదులకు దుర్వాసన వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. వెంటనే సంపును శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.

### అంగన్‌వాడీకి అష్టకష్టాలు..



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని ఫకీరానాయక్ తండాలో అంగన్‌వాడీ కేంద్రం భవనం ప్రమాదకరంగా ఉంది. శిథిలావస్థలో ఉండడంతో నూతన భవన నిర్మాణానికి నిధులిచ్చారు. అదికూడా నిర్మాణ దశలోనే నిలిచిపోయింది. చిన్నారుల ప్రాణాలతో ఆటలాడొద్దని తల్లిదండ్రులు ఈ సందర్భంగా పేర్కొంటున్నారు.

# ‘మధ్యాహ్నా’న్ని ఫౌండేషన్‌కు అప్పగించొద్దు



మాట్లాడుతున్న తోపునూరు చక్రపాణి

పిట్లం(జుక్కల్): సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతో హరేరామహరేకృష్ణ, ఫౌండేషన్ ద్వారా వంటలు చేయడానికి ప్రయత్నించడాన్ని విరమించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వ ర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపునూరు చక్రపాణి పేర్కొన్నారు. ఆయన మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మధ్యాహ్న భోజనం నిర్వాహకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అప్పట్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంట కార్మికులకు నెలకు రూ. 10వేల వేతనం అందిస్తామని అప్పటి కాంగ్రెస్ నాయకుడు, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటికీ ప్రస్తుతం కార్మికులను తొలగించే పనిలో పడ్డారన్నారు. మధ్యాహ్న భోజ నం నిర్వాహకుల సమస్యలను దసరా పండుగ లోపు పరిష్కరించాలని, లేకపోతే దసరా తర్వాత సమ్మెలోకి వెళ్తామన్నారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ పిట్లం, నిజాంసాగర్, పెద్దకొడ్పగల్ మండల పరిధిలోని కార్మికులు పాల్గొన్నారు.

### సేవాలాల్ మందిర నిర్మాణానికి సహకరించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో సేవాలాల్, జగదాంబ మాత ఆలయాల నిర్మాణం కోసం గిరిజనులు సహకరించాలని మండల బంజారా సేవా సమితి అధ్యక్షుడు గన్నూనాయక్ కోరారు. ఆదివారం లింగంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో మండలంలోని 36 తండాల గిరిజనులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో నెల రోజుల్లో సేవాలాల్, జగదాంబ మాత ఆలయాల నిర్మాణం పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో దేశ్యానాయక్, శివరాం నాయక్, ఈశ్వర్, జగ్రామ్, పరుశురాం, రమేశ్ తదితరులున్నారు.

### ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి




బాన్సువాడ : ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ అన్నారు. ఆదివారం రెడ్డి సంఘంలో ఆటో యూనియన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగమయ్యాయని, ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారన్నారు. ప్రతీ ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, వెంటనే ఆ విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలో ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ హోంగార్డు సాయిలు, ఆటో డ్రైవర్లు యూనియన్ అధ్యక్షులు చాంద్, కార్యదర్శి ఆసిఫ్ ఖాన్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్ తదితరులున్నారు.

# కృష్ణాష్టమికి ముస్తాబైన ఆలయాలు



ముస్తాబైన గోపాల స్వామి ఆలయం



పిట్లంలోని బాలాజీ మింజర్ మందిరంలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో నేడు కృష్ణాష్టమి వేడుకలకు గోపాలస్వామి ఆలయం ముస్తాబైంది. కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకం నిర్వహించిన అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

**బిచ్కుందలో..**

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. బాలాజీ మింజర్ మందిరంలో జన్మష్టమి మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి ప్రత్యేక భజనలు, 56 రకాల స్వీట్లు (ఛప్పన్ భోగ్) నైవేద్యంగా సమర్పించనున్నట్లు మహోత్సవ పర్యవేక్షకులు మాజీ జెడ్పీటీసీ కమల్ కిషోర్ తెలిపారు.

**మురళీకృష్ణ మందిరంలో..**



జంగంపల్లి గ్రామంలోని మురళీకృష్ణ విగ్రహం

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి బ్రహ్మజ్ఞానాశ్రమంలోని మురళీకృష్ణ మందిరంలో గోకులాష్టమి వేడుకలను ఈనెల 26వ తేదీన సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆశ్రమ అధ్యక్షుడు రంగ హన్మాగౌడ్, ప్రతినిధులు జనార్ధన్ రెడ్డి, గువ్వ బుచ్చయ్య, బోనగిరి శివకుమార్ ఆదివారం తెలిపారు. సోమవారం ప్రభాతభేరి, ధ్వజారోహణం, నవ గ్రహపూజ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయం నుండి యాదవ సంఘం వరకు పట్టు వస్త్రాల ఊరేగింపు స్వామి వారికి క్షీరాభిషేకం, ఉట్టి కొట్టే కార్యక్రమం, అన్నదానం ఉంటుందన్నారు.

## ఆధ్యాత్మికం

### నేడు వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



పిట్లం(జుక్కల్): మండలంలోని పోతిరెడ్డిపల్లి తండా శ్రీ వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం నేడు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తేజ స్వామి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ వీరాంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నుండే ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### శ్రీదాసాంజనేయ స్వామి ఆలయ సంప్రోక్షణ



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామంలోని శ్రీదాసాంజనేయ స్వామి ఆలయం సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఈనెల 31వ తేదీ శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. భక్తుల సహకారంతో అతిపురాతనమైన ఆలయాన్ని సుందరంగా నిర్మించడం జరిగిందన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాల్సిందిగా వారు కోరారు.

### బోర్లంకు పాదయాత్ర



నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని చంద్రమౌలీశ్వరాలయం నుంచి ఆదివారం భక్తులు బోర్లం బసవేశ్వరాలయానికి పాదయాత్రగా చేపట్టారు. శ్రావణ మాసం సందర్భంగా ప్రతీఏటా నిజాంసాగర్ చంద్రమౌలీశ్వరాలయం నుంచి బాన్సువాడ మండలంలోని బోర్లం బసవేశ్వరాలయానికి పాదయాత్ర కొనసాగిస్తున్నారు. పాదయాత్రలో రెడ్డిశెట్టి, భాస్కర్, శ్రీకాంత్, బట్టు ప్రసాద్‌రాజ్, కిశోర్, ముత్యంరెడ్డి, డాక్టర్ దిలీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# అక్రమాలపై ఎందుకు స్పందించట్లేదు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు శ్రీనివాస్

బాన్సువాడ : బాన్సువాడలో ఎన్నో అక్రమాలు జరుగుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి, ప్రస్తుత బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గత టీడీపీ ప్రభుత్వ హాయంలోనే ఏరియా ఆస్పత్రిని నిర్మించి 25 ఏళ్లు కూడా కాక ముందే ప్రస్తుతం మళ్లీ ఆస్పత్రిని కూలగొట్టి కొత్త భవనం నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. ఆస్పత్రి భవనం కూల్చడానికే రూ.45 లక్షలు కేటాయించడంపై విమర్శలకు తావిస్తోందన్నారు. స్వయంగా అక్రమ వెంచర్లపై మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కౌన్సిలర్లతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఇప్పటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అర్హులైన వారికి కాకుండా డబ్బులు ఇచ్చిన వారికే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చారన్నారు. బాన్సువాడలో జరుగుతున్న అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు శంకర్‌గౌడ్, పాశం భాస్కర్‌రెడ్డి, శ్యామల శ్రీకాంత్, కోనాల గంగారెడ్డి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

### చెట్ల నరికివేతతో స్తంభిస్తున్న ట్రాఫిక్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మెదక్–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిని జాతీయ రహదారిగా విస్తరిస్తున్న క్రమంలో చేపడుతున్న చెట్ల నరికివేత పనులతో తరుచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను కాంట్రాక్టర్ నరికివేస్తున్న క్రమంలో చెట్లు రోడ్డుపై పడి ట్రాఫిక్ స్తంభిస్తుంది. రోడ్డుపై పడ్డ చెట్లను, వాటికొమ్మలను తొలగించే వరకు రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతోపాటు రోడ్డుపై పడ్డ చెట్లకొమ్మలను తొలగించే వరకు వాహనదారులను అదుపు చేసేవారు లేకపోవడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది.

### ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బాన్సువాడ : ఆర్టీసీలో రిటైర్డ్ పొందిన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రిటైర్మెంట్ కార్మికుల సంఘం అధ్యక్షులు కౌసర్ అన్నారు. ఆదివారం బాన్సువాడలో రిటైర్డ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ యాజమాన్యం రిటైర్మెంట్ కార్మికులకు 2017 పేస్కేలు ఏరియార్స్ జాప్యం చేయకుండా చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ 95 పెన్షనర్లకు రూ. 7,500 వెంటనే అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ కార్మికులు శంకర్, నాగనాథ్, ఫరీద్, గంగారం, లక్ష్మణ్, పీరయ్య, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

# మున్నూరు కాపుల మౌనదీక్ష





రెడ్డిపేటలో మౌనదీక్ష చేస్తున్న మున్నూరుకాపు సంఘం సభ్యులు, భిక్కనూరులో..



దోమకొండలో..



మద్నూర్‌లో..

రాష్ట్రంలో మున్నూరుకాపు కులస్తులు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని, వారికి చేయూత నిచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేయాలని కోరుతూ ఆదివారం ఆయా మండలాల్లో మున్నూరుకాపు సంఘం సభ్యులు నిరసన తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



మాచారెడ్డిలో నిరసన తెలుపుతున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు

### కబ్జాకోరుల పనిపడతాం



మాట్లాడుతున్న శంకర్

భిక్కనూరు : దళిత నేతల పేరిట మండలానికి సంబంధం లేనివారు మండల కేంద్రంలో అక్రమంగా కబ్జాలకు పాల్పడుతున్నవారిని, వారికి మద్దతు తెలుపుతున్నవారిని గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్‌మాదిగ అన్నారు. ఆదివారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో మాట్లాడుతూ కొందరూ వేరే మండలాలకు చెందిన దళితనాయకులమని చెప్పుకుంటున్న వారు డబ్బులకు కక్కుర్తి పడి పట్టాభూముల్లో కబ్జాలు చేస్తున్నవారికి మద్దతు తెలుపుతూ మండల కేంద్రంలో అలజడి సృష్టిస్తున్నారన్నారు. సమావేశంలో నేతలు లక్ష్మన్‌మాదిగ, దప్పు రవి, కర్రోల రాజు, రమేష్ పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**ఇంటర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం**

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సురేఖ తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులలో సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఈనెల 28వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

**వాహనాల తనిఖీ**

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమాన విధించారు. ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు పుస్తకాల పంపిణీ**

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఆదివారం బిచ్కుంద లయన్స్ క్లబ్ డైమండ్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్, పుస్తకాలు పంపిణీ చేశారు. అధ్యక్షుడు డాక్టర్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులు చదువుకుంటారు సేవా దృక్పథంతో కార్యక్రమం చేపడుతున్నామన్నారు. లాయర్ లక్ష్మణ్‌రావు, గోపాల్, జగదీష్, ప్రిన్సిపాల్ రాగిణి పాల్గొన్నారు.

**అనారోగ్యంతో మాజీ వైస్ ఎంపీపీ మృతి**



మద్నూర్(జుక్కల్) : మండలంలోని మేనూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ, మాజీ సర్పంచ్ కోలే సాయిగోండ (73) శని వారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు ఆయన సోదరుడు మేనూర్ మాజీ సర్పంచ్ విఠల్ గురుజీ తెలిపారు. కోలే సాయిగొండ కాంగ్రెస్ పార్టీలో ఎన్నో సేవలు అందించారన్నారు.

**నేడు ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే పర్యటన**

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో నేడు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కుర్మ సాయిబాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూంల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించనున్నట్లు తెలిపారు.

**నేడు బోర్లంకు ఎమ్మెల్యే పోచారం..**

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లంలో ఉన్న ఆది బసవేశ్వరాలయంలో పూజ కార్యక్రమాలకు ప్రభుత్వ వ్యవ సాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రా ష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాలరాజు రానున్నారన్నారు.

**రోడ్డును బాగు చేయించాలి**



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డును బాగు చేయించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు ఈ రోడ్డుపై వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. రోడ్డు మధ్యలో కల్వర్టు లేక రోడ్డు తెగి పోయి రాక పోకలకు అంతరాయం ఏర్పడుతుంది.